## క్లుప్తంగా

### గడప గడప పనులు ప్రారంభం

ఉయ్యాలవాడ : మండలంలోని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రస్తావించిన సమస్యల పరిష్కారంలో భాగంగా పనులు ప్రారంభమయ్యాయి. సోమవారం ఇంజేడు గ్రామ సచివాలయ పరిధిలోని ఒంటెద్దుపల్లె గ్రామంలో రూ.1.25 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. పనులను పరిశీలించిన పంచాయతీ రాజ్ ఏఈ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ పనులు నాణ్యతగా చేపడుతున్నామని చెప్పారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ శ్రీకాంత్‌రెడ్డి, ఉప సర్పంచ్ దండే పార్థసారధి రెడ్డి ఉన్నారు.

### సేవలను వినియోగించుకోండి

శిరివెళ్ల: బ్యాంక్ సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కేడీసీసీ బ్రాంచ్ మేనేజర్ అమరనాథ్‌రెడ్డి కోరారు. సోమవారం వెంకటాపురం, కోటపాడులలో బ్యాంక్ సేవలపై సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలకు తమ బ్యాంక్‌లో పొదుపు చేస్తే 9 శాతం వడ్డీ ఇస్తామన్నారు. సీనియార్టీ ఆధారంగా ప్రతి సంఘానికి రూ.5 లక్షల నుంచి రూ. 20 లక్షలు వరకు రుణాలు ఇస్తామని చెప్పారు. ఎఫ్ఎల్‌సీ సౌమ్య, సూపర్‌వైజర్ సుబ్బరాయుడు, సర్పంచులు కందుల మల్లేశ్వరి, దూదేకుల ఉశేన్‌బీ పాల్గొన్నారు.

### తైక్వాండో విజేతలకు అభినందన

నంద్యాల(వ్యవసాయం): స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆళ్లగడ్డలో గత వారం నిర్వహించిన రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల తైక్వాండో పోటీల్లో నంద్యాల జిల్లా క్రీడాకారులను క్రీడా సమాఖ్య కార్యాలయంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ సోమవారం సత్కరించారు. వారు మాట్లాడుతూ సాయితేజ, సూర్యతేజరెడ్డి కాంస్య పతకం సాధించారని చెప్పారు. వీరికి శిక్షణ ఇచ్చిన సర్దార్, షానావాజ్‌లను అభినందించారు.

### 90 శాతం పింఛన్ల పంపిణీ

శిరివెళ్ల: మండలంలో సామాజిక పింఛన్ల పంపిణీ 90 శాతం దాటింది. మండలంలో 8,798 లబ్ధిదారులున్నారు. మండలానికి కొత్తగా 234 పింఛన్లు కాగా వాటిని వారోత్సవాల్లో ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేయించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

### 9న రౌండ్ టేబుల్ సమావేశం

నంద్యాల(అర్బన్): కృష్ణానదీ యాజమాన్య బోర్డు కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలోనే ఏర్పాటు చేయాలనే అంశం పై ఈ నెల 9వ తేదీన నంద్యాలలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు రాయసీమ సాగునీటి సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైఎన్ రెడ్డి సోమవారం తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రామకృష్ణ డిగ్రీ కళాశాలలోని వివేకానంద ఆడిటోరియంలో జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు.బోర్డు ఏర్పాటు, ఆవశ్యకతపై సమగ్రంగా చర్చించేందుకు సమావేశం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

### ట్యాబ్‌ల పంపిణీ

రుద్రవరం: మండలంలోని కోటకొండ ప్రభుత్వ పాఠశాలలో హెచ్ఎం మస్తాన్ సోమవారం సర్పంచ్ డేగాని వెంకటేష్ చేతుల మీదుగా 24 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నంద్యాల(రూరల్): చాబోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు గ్రామ సర్పంచ్ మౌనిక ఎంపీటీసీ చిన్నయ్య సోమవారం ట్యాబులు పంపిణీ చేశారు.

### నూతన కార్యవర్గం ఎంపిక

గోస్పాడు: ఏపీ క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సీఆర్‌పీ డబ్ల్యూఏ రాష్ట్ర కన్వీనర్ వెంకటేష్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. స్థానిక కార్యాలయంలో సోమవారం సీఆర్‌పీలతో సమావేశం నిర్వహించారు. నంద్యాల జిల్లా కావడంతో జిల్లా కార్యవర్గాన్ని ఎంపిక చేసుకున్నట్లు తెలిపారు.జిల్లా అధ్యక్షుడిగా గురప్ప, గౌరవ అధ్యక్షుడిగా దానయ్య, జనరల్ సెక్రెటరీగా ఈశ్వర్ నాయక్, ట్రెజరర్‌గా రాజశేఖర్, కన్వీనర్‌గా శివరామ మద్దిలేటి, అసోసియేట్ ప్రెసిడెంట్లుగా పుల్లయ్య, వెంకటేశ్వరమ్మను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు చెప్పారు. అనంతరం నూతన కమిటీని సన్మానించారు.

### విద్యార్థి బస్సు ఏర్పాటు

దొర్నిపాడు: మండలంలోని చాకరాజువేముల గ్రామానికి ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ఆదేశాల మేరకు ఆళ్లగడ్డ ఆర్టీసీ డిపో మేనేజర్ రాజశేఖర్‌రెడ్డి విద్యార్థి బస్సు ఏర్పాటు చేశారు. దొర్నిపాడు సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మోహన్‌నాయుడు, మార్కెట్‌యార్డు డైరెక్టర్ భూమా శ్రీనివాసరెడ్డి విద్యార్థుల సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో 180 మంది విద్యార్థులు దొర్నిపాడులోని జెడ్పీ హైస్కూల్‌కు, 60 మంది ఆళ్లగడ్డ పట్టణంలోని వివిధ కళాశాలలకు విద్యార్థులు వెళ్తుంటారు. వీరంతా దొర్నిపాడుకు మూడు కిలోమీటర్లు నడిచి వెళ్లాల్సి వచ్చేది. దీంతో సోమవారం గ్రామానికి విద్యార్థి బస్సు రావడంతో విద్యార్థులు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు.

### మున్సిపల్ కార్యాలయంలో 'స్పందన'

నంద్యాల(సిటీ): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు పర్యవేక్షణలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి రెండు వినతులు వచ్చాయన్నారు. ఆయన మాట్లాడుతూ రోజువారీ స్పందనలో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నందున నేటి స్పందనకు వినతులు తగ్గాయన్నారు.

# ఆనంద సమయమిది..



☛ 90 ఏళ్ల వయస్సున్న ఈ వృద్ధురాలి పేరు నన్నెమ్మ. దబ్బ్యాగోవిందిన్నె గ్రామంలో నివాసం ఉంటుంది. సోమవారం గ్రామ సచివాలయ కన్వీనర్ శాంతయ్య పెంచిన పింఛన్ సొమ్ము అందజేయడంతో.. నా లాంటి వారి కోసమే నా మనవుడు జగన్ పింఛన్ పెంచాడు.. దేవుడు సల్లగా చూడాలి.. అంటూ సంతోషం వ్యక్తం చేసిన క్షణాలివి.



☛ ఈ అవ్వపేరు కమలమ్మ. దొర్నిపాడు మండలం క్రిష్టిపాడులో ఉంటున్న ఈమె రూ.70 నుంచి ఇప్పటి వరకు పింఛన్ అందుకుంటోంది. ఒంటరిగా ఉండటం, వయస్సు మీద పడటంతో కాయకష్టం చేయడానికి శరీరం సహకరించడం లేదని, దీంతో ప్రభుత్వం ఇచ్చే పింఛన్ సొమ్ము పైనే ఆధారపడుతోంది. ప్రస్తుతం రూ.2,500 నుంచి రూ.2,750 పెంచి తనకు అండగా నిలిచిందని సంతోషం వ్యక్తం చేస్తోంది.



☛ తెల్లవారుజామునే పెరిగిన పింఛన్ మొత్తం రూ.2,750 చూపుతున్న ఈ వృద్ధురాలి పేరు పకీరమ్మ. బత్తలూరు గ్రామస్తురాలు. భర్త దూరం కావడంతో ప్రభుత్వం మొదట రూ.200 పింఛన్ అందజేసిందని, ఇప్పటి లాగా ఒకటో తేదీననే ఇలా.. ఇంటికొచ్చి ఎవరూ ఇవ్వలేదని, నాలాంటి వారి జీవనానికి ఇబ్బంది పడకూడదని పింఛన్ పెంచి జగన్ సార్ మంచి చేస్తున్నాడు. ఆయన బాగుంటే మాలాంటోళ్లు కడుపు నింపుకునేందుకు ఇబ్బందులుండవంటూ పేర్కొంది.

- పింఛన్‌దారులకు అండగా ప్రభుత్వం మరో ముందడుగు
- రూ.2,500 నుంచి రూ.2,750కు పింఛన్ పెంపు
- లబ్ధిదారుల మోములో విరబూసిన సంతోషం



చాగలమర్రి మండలం మద్దూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి

ఆళ్లగడ్డ: ఒక్కోరిది ఒక్కో రకమైన గాథ.. భర్త చనిపోయి ఒకరు.. వృద్ధాప్యంలో శరీరం సహకరించక జీవనానికి ఇబ్బందులు పడుతున్న మరొకరు.. అవిటి తనంతో కడుపు నింపుకోవడానికి అష్టకష్టాలు పడుతున్న ఇంకొకరు.. అయిన వారు లేక..అన్నానికి, మందులకు డబ్బులేక, వయస్సు మీద పడి ఒంటరిగా జీవిస్తున్న వారు.. ఇలా.. ఒక్కొక్కరిదీ ఒక్కో రకమైన గాథ.. వీరందరినీ ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రతి నెల ఠంఛనుగా పింఛన్ అందజేస్తూ అండగా నిలుస్తోంది. అయితే వారి జీవనానికి మరింత సహకారం అందించేందుకు ఈ నెల నుంచి పింఛన్ మొత్తాన్ని రూ.2,500 నుంచి రూ.2,750 పెంచి అందజేస్తుంది. దీంతో లబ్ధిదారుల ముఖాల్లో సంతోషం వ్యక్తమవుతోంది. నియోజకవర్గంలో మొత్తం 38,317 పింఛన్లు ఉండగా వీరికి రూ.10,55,76,000 నగదును గ్రామ వలంటీర్లు అందజేస్తున్నారు.

**మండలాల వారీగా పింఛన్ల వివరాలు**

| మండలం | మొత్తం పింఛన్లు | మంజూరైన నగదు (రూ.) |
|---|---|---|
| ఆళ్లగడ్డ | 5,082 | 1,40,37,500 |
| ఆళ్లగడ్డ (అర్బన్) | 5,097 | 1,41,34,250 |
| చాగలమర్రి | 6,272 | 1,73,36,250 |
| దొర్నిపాడు | 3,678 | 1,01,13,750 |
| రుద్రవరం | 6,273 | 1,73,46,750 |
| శిరివెళ్ల | 8,073 | 2,20,61,250 |
| ఉయ్యాలవాడ | 3,842 | 1,05,46,250 |
| మొత్తం | 38,317 | 10,55,76,000 |

### అర్హతే ప్రామాణికంగా పింఛన్లు



అర్హతే ప్రామాణికంగా పింఛన్లను మంజూరు చేస్తున్నాం. అర్హత ఉన్న ఎవరినీ తొలగించలేదు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి పింఛన్లపై ఆడిట్ జరుగుతుంది. పింఛన్ దారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఇప్పటికే గ్రామ/వార్డు వలంటీర్లు 95 శాతానికి పైగా పింఛన్లు అందజేశారు.

–శ్రీధర్ రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ, నంద్యాల జిల్లా

### దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(అర్బన్): నంద్యాల జిల్లాలోని నంద్యాల(రూరల్) ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న 3 ప్రధాన అంగన్‌వాడీ కార్యకర్తలు, 9 మంది ఆయాల నియామకం కోసం అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సీడీపీఓ ఉషారాణి తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుల కింద పాణ్యం మండలం భూపనపాడు-1(బీసీ-సీ) భూపనపాడు-2(ఎస్సీ) గడివేముల మండలం బిలకలగూడూరు-3(ఓసీ)తో పాటు ఆయాలు బీటీ నగర్-1(ఎస్టీ) మిట్నాల-(ఓసీ) చాపిరేవుల-1(ఈడబ్ల్యూఎస్) పాణ్యం మండలం ఆలమూరు-1(ఓసీ) కందికాయ పల్లె-1(ఎస్సీ) కందికాయపల్లె-2(బీసీ-ఏ) గోస్పాడు మండలం పార్వతీపురం(బీసీ-బీ) మహానంది మండలం మసీదుపురం-2 (బీసీ-బీ) తిమ్మాపురం-1(ఓసీ) రిజర్వేషన్ల వారీగా ఎంపికలు జరుగుతాయన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు 10వ తరగతి, ఆయా పోస్టుకు 7వ తరగతి పాసై ఉండాలన్నారు. వయస్సు 2022 జూలై నాటికి 21 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాలలోపు ఉండాలని చెప్పారు. పెళ్లై అదే గ్రామంలో నివసించు వారు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తుతో పాటు ధ్రువ పత్రాల జిరాక్స్ కాపీలను జతపరిచి సంబంధిత సీడీపీఓ కార్యాలయంలో ఈనెల 10వ తేదీ లోపు అందజేయాలని సూచించారు. అలాగే నంద్యాల అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఒక మెయిన్ అంగన్‌వాడీ కార్యకర్త, 7 అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్న సీడీపీఓ చంద్రకళ తెలిపారు. నందమూరినగర్-2(ఓసీ) మహిళకు కేటాయించామన్నారు. హెల్పర్ పోస్టుల కింద కన్యకాపరమేశ్వరి నగర్ (బీసీ-సీ), సరస్వతీనగర్(బీసీ-డీ), వీసీ కాలనీ-3 (బీసీ-ఏ), నీలివీధి(ఓసీ), గోపాలనగర్(ఎస్సీ), నడిగడ్డ-1 (ఓసీ), సలీంనగర్-1 (బీసీ-బీ) ఈ విధమైన రిజర్వేషన్ల వారీగా ఎంపికలు జరుగుతాయన్నారు.

### గోస్పాడుకు నేడు ఎమ్మెల్యే రాక

గోస్పాడు: నూతన పింఛన్ల పంపిణీ కోసం ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి మంగళవారం మండల కేంద్రం రానున్నారని ఎంపీడీఓ సుగుణశ్రీ తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ మండలానికి 169 పింఛన్లు మంజూరయ్యాయన్నారు. ఇందులో దీబగుంట్లకు 17, గోస్పాడు 16, జిల్లెల్ల 22, జూలేపల్లె 15, కానాలపల్లె 8, ఎం.కృష్ణాపురం 9, నెహ్రూనగర్ 6, పసురపాడు 11, సాంబవరం 10, ఒంటివెలగల 7, యాళ్లూరు-1లో 24, యాళ్లూరు-2లో 24 కొత్త పింఛన్లు మంజూరయ్యాయని వివరించారు.



అహోబిలంలో ఉత్తరద్వారం వద్ద బారులు తీరిన భక్తులు



గరుడ వాహనంపై ఊరేగుతున్న ప్రహ్లాదవరదుడు



శిరివెళ్లలో పూజలు చేస్తున్న భక్తులు



యర్రగుంట్ల గీతామందిరంలో భక్తులకు అన్నదానం

# భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి

- భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి
- అహోబిలేశుడికి భక్తుల నీరాజనం
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

వైకుంఠ ఏకాదశి సందర్భంగా సోమవారం నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, కల్యాణోత్సవాలు నిర్వహించారు. ఆయా ఆలయాల్లో ఉత్తర ద్వారం ద్వారా స్వామి వారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి దంపతులు చాగలమర్రి మండలం మద్దూరు గ్రామంలో జరిగిన పూజల్లో పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ రుద్రవరం మండలంలోని వాసాపురం వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకొని కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఇక అహోబిల క్షేత్రానికి భక్తులు పోటెత్తడంతో నల్లమల గిరులు నరసింహ నామ స్మరణతో మారుమోగాయి. అహోబిలేశుడు గరుడ వాహనంపై విహరించి భక్తులను ఆశీర్వదించారు.



ప్రత్యేక అలంకరణలో వాసాపురం వేంకటేశ్వరస్వామి







మద్దూరులో జరిగిన పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ ప్రభాకర్‌రెడ్డి దంపతులు, రుద్రవరంలో ఎస్పీకి స్వాగతం పలుకుతున్న దృశ్యం,దొర్నిపాడులో కల్యాణం జరిపిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: అహోబిల క్షేత్రం సోమవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తకోటి నరసింహ నామస్మరణతో పులకించింది. ముందుగా ఆలయ ఉత్తర ద్వారం వద్ద యాగశాలలో ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి కొలువుంచారు. తెల్లవారు జామున 3 గంటలకు ఆలయ ప్రధానార్చకులు వేణుగోపాలన్ స్వామికి హారతులు ఇచ్చి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆళ్లగడ్డ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐ నరసింహులు బందోబస్తును పర్యవేక్షించారు.

రుద్రవరం: రుద్రవరం– అప్పనపల్లె రహదారిలో వెలసిన లక్ష్మీగోదా సమేత వాసపురం వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకుభక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో తెల్లవారు జామున 3గంటల నుంచి భక్తులకు ఉత్తర ద్వారం ద్వారా దర్శన భాగ్యం కలిగించారు. ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి దంపతులు, ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి, ఆళ్లగడ్డ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి తదితరులు ఉత్తర ద్వారం ద్వారా వేంకటేశ్వరస్వామిని దర్శించుకొని విశేష పూజలు నిర్వహించారు. ఆలయ వద్దకు వచ్చిన వారికి నిర్వాహకులు విడివిడిగా పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

ఉయ్యాలవాడ : మండలంలోని ఇంజేడు, సుద్దమల్ల, ఉయ్యాలవాడ, హరివరం, బోడెమ్మనూరు గ్రామాల్లో వెలిసిన శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి, శ్రీ లక్ష్మీనరసింహ కంబగిరిస్వామి, శ్రీ వీరభద్ర స్వామి, రామలింగేశ్వరస్వామి, చెన్నకేశవ స్వామి ఆలయాలకు భక్తులు తరలి వెళ్లి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఇంజేడులో శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కోనేటి రాయుడి కల్యాణం వైభవంగా జరిగింది. అర్చకులు రమణయ్య, అనంతయ్య, సుధాకర్ ఆధ్వర్యంలో కల్యాణ తంతు జరిపించారు.



ఇంజేడులో కల్యాణం జరిపిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): ధనుర్మాసం, వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని పట్టణంలోని పలు వైష్ణవ దేవాలయాల్లో భక్తులు తెల్లవారుజాము నుంచే ఉత్తర ద్వారం నుంచి స్వామి వారిని దర్శించుకోవడానికి బారులుతీరారు. సంజీవనగర్‌రామాలయం, గుడిపాటిగడ్డలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర, తెలుగుపేటలోని శ్రీలక్ష్మీమద్దిలేటి, కోటావీధిలోని శ్రీరమాసమేత సత్యనారాయణస్వామి, బైర్మల్‌వీధిలోని ఉత్తరాధి మఠం, బాలాజీ కాంప్లెక్స్‌లోని బాలాజీ కల్యాణ మండపంలో రోజాకుంట రోడ్డులోని నాగలింగేశ్వర దేవాలయాల్లో పుష్పాలు, పండ్లతో మూలమూర్తులను విశేషంగా అలంకరించారు. పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయాలు కిటకిటలాడాయి. సంజీవనగర్ రామాలయంలోని శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వర స్వామి వారిని శ్రీకాంత్‌శర్మ ఆధ్వర్యంలో జీడిపప్పు, ఎండుద్రాక్ష, బాదం, పిస్తా, తదితర వాటితో అభిషేకాలు జరిపించారు. మూలవిరాట్‌కు వాల్‌నట్స్‌తో శ్రీకూర్మావతారంలో సువర్ణ లక్ష్మీకాసుల మాలతో అలంకరించారు. ఆయా ఆలయాల్లో విశేష పూజలు, అభిషేకాలు, పారాయణలు, కల్యాణం, పల్లకోత్సవం, సహస్ర నామార్చన, మంత్రపుష్పం, మహామంగళ హారతులు, సాయంత్రం ఉత్సవమూర్తుల ఊరేగింపు నిర్వహించారు.

– గోస్పాడులోని శ్రీరుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని తెల్లవారుజామునే స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఉత్తర ద్వారం ద్వారా స్వామి వారి దర్శనం ఏర్పాట్లను నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ముక్కమల్ల వేణుగోపాల్‌రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



నంద్యాలలో ప్రత్యేక అలంకరణలో శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీ నరసింహస్వామి



దర్శనం కోసం క్యూలైన్లలో ఉన్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో ఉత్తరాధి మఠం వేంకటేశ్వరస్వామి

# వైఎస్సార్‌సీపీ పాలనలో సిఫారసులకు చెల్లు

- అర్హత ఉంటే పథకాల వర్తింపు
- ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి
- ఆళ్లగడ్డలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

ఆళ్లగడ్డ: గతంలో ఏదైనా పథకం వర్తించాలంటే జన్మభూమి కమిటీల సభ్యులు, నాయకుల చుట్టూ తిరగడమే కాకుండా అంతో ఇంతో ఇచ్చుకోవాలి. అయినా ఆ పథకం అందుతుందన్నా గ్యారెంటీ లేదు. దీంతో ఎంతోమంది పేదలు పథకాలకు దూరంగా నిలిచిపోయారు. అయితే జగనన్న పాలనలో ఆ పరిస్థితి లేదు. కేవలం అర్హతే ప్రామాణికంగా ముంగిటకే పథకం అందేలా పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని గంగమ్మ వీధి, అహోబిలం రోడ్డు ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గడప గడపకు వెళ్లి ఆప్యాయంగా పలకరిస్తూ మూడున్నరేళ్ల కాలంలో తమ ప్రభుత్వం అందించిన పథకాల వివరాలను చదివి వినిపించి బుక్‌లెట్ అందజేశారు. పథకాలు అందాయోలేదా అని అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టి తేవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ సుధాకర్‌రెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, సీపీ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ శీలం సురేంద్రనాథ్‌రెడ్డి, సింగం వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

### ఇంత మొత్తంలో ఎన్నడూ లబ్ధి పొందలేదు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నుంచి రూ.2,17,297 నగదు వివిధ పథకాల కింద అందింది. వైఎస్సార్ పింఛన్ కానుక ద్వారా రూ.1.90 లక్షలు, వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.22,294, వైఎస్సార్ సున్నా వడ్డీ ద్వారా రూ.5,003 అందుకున్నా. గతంలో ఎన్నడూ ఇన్ని పథకాలు అందలేదు. అలాగే ఇంత మొత్తం లబ్ధి చేకూరలేదు.

– వెంకటేశ్వర్లు, ట్రాన్స్‌జెండర్